కస్టమ్స్ అధికారులపై సీబీఐ కేసు

5 చోట్ల తనిఖీలు, 4.76 లక్షలు స్వాధీనం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేస్తున్న ఇద్దరు కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది. గత అక్టోబర్ 5న జెడ్డా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ వ్యక్తి, అతడి కుటుంబసభ్యుల నుంచి కస్టమ్స్ క్లియరెన్స్ కోసం రూ.50,000 లంచం డిమాండ్ చేశారు. అధికారులు ఒత్తిడి పెట్టడంతో ఆ వ్యక్తి డబ్బులు ఇచ్చి, ఆ తర్వాత సీబీఐని ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సీబీఐ అధికారులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం సీబీఐ అధికారులు హైదరాబాద్, ముజఫర్‌పూర్(బీహార్), మాన్సా (పంజాబ్)లోని 5 చోట్ల కస్టమ్స్ అధికారుల ఇండ్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేసి రూ.4.76 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ అధికారులు వినయ్ కుమార్, ముఖేశ్‌కుమార్‌గా గుర్తించారు. వీరితో పాటు కెనరా బ్యాంక్ అధికారి సంతోష్‌కుమార్ పైనా కేసు నమోదుచేశారు.

హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న ప్రపంచ తెలుగు మహాసభలు శుక్రవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాసభలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉంటున్న తెలుగు ప్రముఖులు, కవులు, కళాకారులు, సినీనటులు, రచయితలు, భాషాభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తొలిరోజు బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొన్న చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతిని కాపాడుకొని భవిష్యత్తుతరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని అభివర్ణించారు. 2047 నాటికి ప్రపంచంలో నంబర్‌వన్ కమ్యూనిటీగా తెలుగుజాతి నిలువనున్నట్టు ఆకాంక్షించారు.

మార్గదర్శి కేసులో కౌంటర్లు వేయరా?

ప్రభుత్వాల తీరుపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్ జనవరి 3 (నమస్తే తెలంగాణ): మార్గదర్శి ఫైనాన్షియర్లు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్టు నమోదైన కేసులో తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు కౌంటర్లు దాఖలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటివరకు 13 సార్లు ఈ కేసు విచారణ జరిగినప్పటికీ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు కౌంటర్లు వేయలేదని గుర్తుచేస్తూ.. ఇంకా ఎన్నాళ్లకు కౌంటర్లు దాఖలు చేస్తారని ప్రశ్నించింది. చివరిసారిగా 3 వారాల గడువు ఇస్తున్నామని, ఈసారి కూడా కౌంటర్లు వేయకపోతే విచారణకు హాజరుకావాల్సిందిగా రెండు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులను ఆదేశిస్తామని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది. ఆలోగా అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని రిజర్వు బ్యాంకును కూడా ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జీ రాధారాణి ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజా పీడనగా ప్రజావాణి

- **పరిష్కరించకుండా తిరస్కరించిన ఫిర్యాదులే అధికం**
- **రోజూ ప్రజదర్బార్ అని చెప్పి.. 2 రోజులకు తగ్గించారు**
- **ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పెట్టి ప్రహసనంగా మార్చారు**
- **ప్రజల ఆశలను అడియాశలుగా మార్చిన ప్రభుత్వం**
- **సర్కారు తీరుపై మండిపడిన మాజీమంత్రి హరీశ్‌రావు**
- **సమాచార హక్కు చట్టం ఆధారంగా ప్రజావాణి గుట్టురట్టు**

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ప్రతిరోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో డబ్బాకొట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజాపీడనగా మార్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజావాణిలో పరిష్కరించకుండా తిరస్కరించిన దరఖాస్తులు ఎక్కువ అని విమర్శించారు. ప్రజావాణి అసలు బండారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా ఆయన బట్టబయలు చేశారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రతిరోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తామని చెప్పి నిర్వహించకపోగా దానిని ప్రజావాణిగా పేరుమార్చారని తెలిపారు. కానీ అది ప్రజాపీడనగా మారిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి కేవలం ఒకే ఒక్కరోజు హాజరై 10 నిమిషాల పాటు మాత్రమే ప్రజల నుంచి వినతులు స్వీకరించారని గుర్తుచేశారు. దీన్ని బట్టే ప్రజాదర్బార్ పట్ల ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తేటతెల్లమైందని అన్నారు. కనీసం మంత్రులైనా ఉంటారని ఆశించిన జనానికి నిరాశే ఎదురవుతున్నదని చెప్పారు. మంత్రులకు గాంధీభవన్‌కు వెళ్లేందుకు ఉన్న తీరిక ప్రజావాణికి రావడానికి మాత్రం లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు రాకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో ప్రజావాణిని నామమాత్రంగా నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతినిత్యం నిర్వహిస్తామని ఊదరగొట్టి ఇప్పుడు వారానికి రెండు రోజులు మాత్రమే నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆ రెండు రోజులు ఎన్నో వ్యయప్రయాసలకు, దూరాభారాలకు ఓర్చి దరఖాస్తులు అందిస్తే.. అది వృథాప్రయాసగా మిగిలిపోతున్నదని ఫిర్యాదుదారులు వాపోతున్నారని తెలిపారు.

సగానికిపైగా తిరస్కరణ

ప్రజావాణి ప్రారంభించినప్పటి నుంచి గత నెల (డిసెంబర్) 9వ తేదీ నాటికి వచ్చిన 82,955 పిటిషన్లలో కేవలం 43,272 పిటిషన్లు మాత్రమే గ్రీవెన్సెస్ (పరిష్కరించదగిన సమస్యలు) కిందకు వస్తాయని అధికారులు చెప్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. అన్యాయం, హక్కులకు భంగం, ప్రభుత్వ పథకాలు అందకపోవడం, అధికారులు తమ విధులు నిర్వహించకపోవడం, ప్రజలకు సిటిజన్ చార్టర్ ప్రకారం అందవలసిన సదుపాయాలు అందకపోవడం వంటివాటినే తాము గ్రీవెన్సెస్‌గా పరిగణిస్తామని అధికారులే ధ్రువపరుస్తున్నారని (సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన సమాచారం ఆధారంగా) ఆయన ఉదహరించారు. అంటే భూ తగాదాలు, భూ నిర్వాసితుల సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు, పేదరిక సంబంధ సమస్యలు, ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల అమలు మొదలైనవి గ్రీవెన్సెస్ కిందకు రావని సగం కన్నా ఎక్కువ దరఖాస్తులను తిరస్కరించిన విషయాన్ని ఆయన ఆధారాలతో సహా బయటపెట్టారు.

డిసెంబర్ 9 నాటికి వచ్చిన ఫిర్యాదులు
82,955

వీటిలో గ్రీవెన్సెస్‌గా గుర్తించినవి
43,272

పరిష్కరించామని చెప్తున్నవి
27,215

ప్రహసనంగా ప్రజావాణి

ప్రజావాణి ప్రహసనంగా మారిందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణికి వచ్చిన మొత్తం 82,955 పిటిషన్లలో గ్రీవెన్సెస్‌గా గుర్తించినవి కేవలం 43,272 మాత్రమేనని తెలిపారు. వీటిలో 27,215 పరిష్కరించామని అధికారులు చెబుతున్నదాంట్లో ఎంతమాత్రం నిజంలేదని అన్నారు. క్షేత్రస్థాయిలో తమకు ఉన్న స్పష్టమైన సమాచారం ప్రకారం .. అనేక అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించకుండానే ఫైళ్లను క్లోజ్ చేశారని తెలిపారు. ప్రజావాణిలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో వ్యయప్రయాసలకు ఓర్చి హైదరాబాద్ దాకా వచ్చిన వారి ఆశలు అడియాసలవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కొండంత ఆశలు రేపి, గోరంత కూడా న్యాయం చేయని దైన్యం నెలకొన్నదని మండిపడ్డారు.

బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్‌కు డాక్టరేట్

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. యూనివర్సిటీ జర్నలిజం విభాగం 'రిప్రజెంటేషన్ అండ్ ప్రజెంటేషన్ ఆఫ్ దళిత్స్ ఇన్ మీడియా' అనే అంశంపై క్రిశాంక్ సిద్ధాంత గ్రంథం సమర్పించారు. ప్రొఫెసర్ కరణం నరేందర్ పర్యవేక్షణలో ఆయన పీహెచ్‌డీ చేశారు. మాస్ కమ్యూనికేషన్‌లో పీజీ చేసి న క్రిశాంక్ ఇప్పటికే యూజీసీ నెట్ అర్హతసాధించి, కీలకమైన ప్రాజెక్టుల్లో రీసెర్చ్ ఫెలోగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

రైతులకు కాంగ్రెస్ వెన్నుపోటు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆ హామీలను అమలు చేయకుండా రైతులకు వెన్నుపోటు పొడుస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ అరకొరగా చేశారని, ఇప్పుడు రైతు భరోసాకు కొర్రీలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వద్ద రైతుల వివరాలన్నీ ఉన్నా దరఖాస్తుల పేరుతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో రైతులకు అనేక హామీలిచ్చి, ఇప్పుడు అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతు భరోసా కింద రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం, రైతు కూలీలకు రూ.12 వేల సాయం, వరితోపాటు సుమారు 10 రకాల పంటలపై రూ.500 బోనస్, పత్తి, మొక్కజొన్న, కందులు, సోయాబీన్, పత్తి, మిర్చి, పసుపు, ఎర్రజొన్న, చెరుకు, జొన్నలకూ ఇస్తామన్న బోనస్ హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 'మార్పు' పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఏడాదిగా ప్రజల జీవితాల్లో మార్పు రాలేదని, కాంగ్రెస్ నేతల్లో మాత్రం వచ్చిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ది ప్రజలను మోసం చేసే ప్రభుత్వమని మండిపడ్డారు. నిరుడు నవంబరు 30న పాలమూరులో సీఎం రేవంత్ ఇచ్చిన చెక్కులకు ఇప్పటివరకూ డబ్బులు పడలేదని ధ్వజమెత్తారు.

సీఎం ఆమోదం లేక నిలిచిన జేఎల్‌ల భర్తీ

- **సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తైనా నియామకపత్రాలివ్వని వైనం**
- **అందాల్సింది అపాయింట్‌మెంట్ ఆర్డర్లే.. ఏదీ తేల్చని సీఎం**

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఉద్యోగం వారి కల. 14 ఏండ్ల తర్వాత జేఎల్ నోటిఫికేషన్ వెలువడటంతో సంతోషపడ్డారు. గెజిటెడ్ ఉద్యోగం కావడంతో అహోరాత్రులు శ్రమించారు. మంచి ప్రతిభ కనబరిచి ఎట్టకేలకు ఉద్యోగం సాధించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తయింది. కేవలం అపాయింట్‌మెంట్ ఆర్డర్ మాత్రమే చేతికందాల్సి ఉంది. కానీ ఎడతెగని తాత్సారం.. ఎదురుచూపులు. దీనికంతటికి కారణం సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం లేకపోవడమే. దీంతో రాష్ట్రంలో జేఎల్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ల జారీ నిలిచిపోయింది.

ఇంటర్‌విద్యకు చేరిన కథ..

రాష్ట్రంలో 2008 తర్వాత మళ్లీ 2022లో నోటిఫికేషన్ జారీ అయ్యింది. కేసీఆర్ సర్కారు చొరవతో 23 సబ్జెక్టులకు 1,392 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ 2022 డిసెంబర్ 9న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ విద్య చరిత్రలో ఒకేసారి 1,300కు పైగా పోస్టులను భర్తీచేయడం ఇదే తొలిసారి. 2023 సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహించి, 2024 జూన్ 8న జనరల్ ర్యాంకింగ్ లిస్టు ప్రకటించారు. డిసెంబర్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయింది. ఇప్పుడు కేవలం నియామకపత్రాలు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. రిక్రూట్‌మెంట్ బాధ్యతలను టీజీపీఎస్సీకి అప్పగించారు. టీజీపీఎస్సీ ప్రక్రియనంతా పూర్తిచేసి ఇంటర్ విద్య కమిషనరేట్‌కు అప్పగించింది. ఇంటర్ విద్య కమిషనరేట్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే విద్యాశాఖ మంత్రి అయిన సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం కోరింది. సీఎం నుంచి స్పందన లేకపోవడంతో ఆర్డర్ల జారీలో జాప్యం జరుగుతున్నది. సీఎం ఈ విషయంపై చొరవ చూపి నియామకపత్రాలివ్వాలంటూ జేఎల్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. 1,392 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, వీటిలో కోర్టు కేసులతో 253 పోస్టుల భర్తీ నిలిచిపోయింది. ఇవి ఇంగ్లిష్, బోటనీ సబ్జెక్టుల పోస్టులు కావడం గమనార్హం. మల్టీ జోన్-1లో 581, మల్టీజోన్-2లో 558 చొప్పున 1,139 జేఎల్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ అయింది.

21న కేఆర్‌ఎంబీ సమావేశం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) సమావేశాన్ని ఈ నెల 21న నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఇరు రాష్ట్రాలకు కేఆర్‌ఎంబీ అధికారులు సమాచారం అందించారు. వాస్తవంగా బోర్డు సమావేశాన్ని నవంబర్‌లోనే నిర్వహించాలని తొలుత ఖరారు చేశారు. ఏజెండా అంశాలను పంపించాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు బోర్డు లేఖ రాసింది. అయితే ఒకసారి ఏపీ, మరోసారి తెలంగాణ ప్రభుత్వం సమావేశాన్ని వాయిదా వేయాలని కోరడంతో కేఆర్‌ఎంబీ ఆ మేరకు సమావేశాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. చివరికి ఈ నెల 21న సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

ఒక్క ఊరిలో 100 ఇండ్లకు టార్పాలిన్లే!

- **ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో గోవిందాపూర్ సెక్రటరీ నిర్లక్ష్యం**
- **షోకాజ్ నోటీసు అందజేసిన హనుమకొండ జిల్లా కలెక్టర్**

శాయంపేట, జనవరి 3: ఇందిరమ్మ ఇండ్ల సర్వే యాప్‌లో పంచాయతీ కార్యదర్శి నమోదు తీరు అధికారులను విస్తుపరిచింది. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గోవిందాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల కోసం 198 దరఖాస్తులు రాగా, వారి ఫొటోను యాప్‌లో నమోదు చేయాల్సి ఉన్నది. గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ ఏకంగా 100 ఇండ్లు టార్పాలిన్ కప్పిఉన్న పెంకుటిండ్లుగా నమోదు చేశారు. మరో గ్రామంలో సైతం 50కి పైగా ఇలాంటి ఇండ్లే ఉన్నట్టు తేలింది. ఒక్క గ్రామంలోనే 100 వరకు టార్పాలిన్ షీట్లు కప్పుకున్న పెంకుటిండ్లు ఉండడమేంటని అనుమానించిన రాష్ట్రస్థాయి అధికారులు.. జిల్లా హౌసింగ్ పీడీ రాజేందర్, ఎంపీడీవో ఫణిచంద్ర, హౌసింగ్ ఏఈలను రంగంలోకి దించారు. టార్పాలిన్ షీట్లు కప్పిన ఇండ్లను పరిశీలించారు. వాటిలో మూడు మాత్రమే టార్పాలిన్ షీట్లు కప్పినవి ఉండగా, మిగతావి స్లాబులు, రేకుల ఇండ్లు ఉన్నట్టు గుర్తించారు. కార్యదర్శి ఇంటింటికీ తిరగకుండా టార్పాలిన్ కప్పిన ఫొటోనే 100 ఇండ్లకు నమోదు చేసినట్టుగా తెలుస్తున్నది. రాష్ట్రస్థాయి యాప్‌లో నమోదు కావడంతో తొలగించలేకపోతున్నారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్లక్ష్యం వహించిన కార్యదర్శి శ్రీనివాస్‌కు కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. వారం రోజుల్లో సమాధానం చెప్పాలని ఆదేశించారు.

ఉద్యోగానికి ఎంపిక.. తిరస్కరణ

డీఈవో నిర్వాకంతో టాప్ ర్యాంకర్‌కు దక్కని జాబ్

ఖానాపురం, జనవరి 3 : వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారులు చేసిన తప్పిదం ఓ గిరిజన నిరుద్యోగ యువకుడి పాలిట శాపంగా మారింది. ఖానాపురం మండల కేంద్రానికి చెందిన పాలకుర్తి మహేందర్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డీఎడ్ పూర్తిచేశాడు. 2024లో స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎస్జీటీ)లో డీఎస్సీ పరీక్ష రాయగా, జిల్లా స్థాయిలో 10వ ర్యాంకు వచ్చింది. మెరుగైన ర్యాంకు, రిజర్వేషన్ ఉండటంతో మహేందర్ ఉద్యోగానికి ఎంపికైనట్టు అధికారుల నుంచి సమాచారం అందింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగిసిన అనంతరం కౌన్సెలింగ్ అండ్ పోస్టింగ్ కోసం మరోసారి పిలుపువచ్చింది. తీరా కౌన్సెలింగ్‌కు వెళ్లగా లిస్టులో పేరు లేదు. డీఈవో జ్ఞానేశ్వర్‌ను అడగటంతో స్టేట్ ఆఫీసుకు సర్టిఫికెట్లు పంపిస్తే అనర్హుడిగా పేర్కొన్నరంటూ సమాధానం ఇచ్చాడు. దీంతో తాను ఇగ్నోలో రెగ్యులర్‌గా, బెంగుళూరు యూనివర్సిటీలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో డీఎడ్ చేసినట్టు మహేందర్ తెలిపారు. తనతోపాటు వివిధ జిల్లాల్లో చదివిన 20మంది అభ్యర్థులకు ఇదే డీఎస్సీ లో ఉద్యోగాలు వచ్చినట్టు ఆధారాలతో చూపాడు. దీంతో కంగుతిన్న డీఈవో తప్పిదం చేసినట్టు తెలుసుకొని మహేందర్‌కు ఉద్యోగం వచ్చేందుకు ప్రయత్నం చేస్తానని రోజూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడు. ఇదే విషయమై మహేందర్ గతంలో కలెక్టర్ సత్యశారదను కలిశాడు. స్పందించిన కలెక్టర్.. డీఈవోను తన కార్యాలయానికి పిలిపించుకొని మహేందర్‌కు న్యాయం చేయాలని ఆదేశించారు. అయినా, 2 నెలలుగా ఉద్యోగం కోసం డీఈవో కార్యాలయం, స్టేట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. డీఈవో నిర్వాకంతోనే తనకు ఉద్యోగం రాలేదని మహేందర్ ఆరోపిస్తున్నాడు.



తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్న మహేందర్

పరీక్షలు కాకుండానే సెకండియర్ సిలబస్

- **సీఈవోలకు సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆదేశం**
- **విస్మయం వ్యక్తం చేస్తున్న గురుకుల ఉపాధ్యాయులు**
- **మానసిక ఒత్తిడికి గురవుతున్న ఇంటర్ విద్యార్థులు**

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాయకముందే, సెకండియర్ సిలబస్‌ను బోధించాలని, అందుకు మైక్రో షెడ్యూల్‌ను కూడా ఖారారు చేసి జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ వింత పోకడలపై సీఈవోల్లోని సిబ్బంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 38 సీవోఈలు ఉన్నాయి. అందులో విద్యార్థులకు ఇంటర్ విద్యతోపాటు సమానంగా జేఈఈ, నీట్ పరీక్షలకు సైతం శిక్షణ అందిస్తున్నారు. పరీక్షలు పూర్తయ్యేవరకూ సదరు విద్యార్థులకు ఫస్టియర్ సబ్జెక్టు రివిజన్లు, మాక్ టెస్టులు నిర్వహించడం పరిపాటి. ఫస్టియర్ పరీక్షలు రాసిన అనంతరం సెకండియర్ సిలబస్ బోధించడం ఆనవాయితీ.



ఇంకా ఫస్టియర్ సిలబస్ పూర్తికాలే..

ఇంటర్ పరీక్షలు మార్చి5 నుంచి కొనసాగనున్నాయి. దాదాపు 2 నెలల సమయముంది. వాస్తవంగా సొసైటీలోని సీవోఈల్లో ఇంకా ఫస్టియర్ గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం సిలబస్ పూర్తి కాలేదు. కానీ సొసైటీ ఉన్నతాధికారులు మాత్రం జనవరి 1 నుంచే ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సెకండియర్ సిలబస్‌ను బోధించడం ప్రారంభించాలని హుకూం జారీ చేశారు. అంతేకాదు సబ్జెక్టులవారీగా ఫిబ్రవరి 2 వరకు మైక్రోషెడ్యూల్‌ను కూడా ఖరారు చేయడం గమనార్హం. ఫస్టియర్ పబ్లిక్ పరీక్షలకు సంసిద్ధం కావలసిన సమయంలో విద్యార్థులకు సెకండియర్ పాఠాలు బోధించడంపై టీచర్లు మండిపడుతున్నారు. కార్పొరేట్ కాలేజీల తరహాలో సొసైటీ వ్యవహరిస్తున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు నిప్పులు చెరుగుతున్నారు. ఇది అంతిమంగా పిల్లలపై మానసిక ఒత్తిడికి గురిచేస్తుందని ధ్వజమెత్తుతున్నారు. ఇప్పటికే గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన రేకెత్తిస్తున్నాయని, అయినప్పటికీ సొసైటీ ఉన్నతాధికారులు ఏమాత్రం గుణపాఠాలు నేర్వకుండా, అనాలోచిత, అస్తవ్యస్త నిర్ణయాలు తీసుకోవడం సరికాదని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

మూడేండ్లకోసారి బడి ఫీజుల పెంపు !

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : పాఠశాలల్లో ప్రతి మూడేండ్లకోసారి ఫీజులు పెంచే అవకాశముంది. ఈ లోపు ఫీజులు పెంచకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. ఫీజులపై కసరత్తు చేస్తున్న తెలంగాణ విద్యాకమిషన్ శుక్రవారం తల్లిదండ్రుల సంఘాలతో చర్చలు జరిపింది. సైఫాబాద్‌లోని పాఠశాల డైరెక్టరేట్ కార్యాలయంలో విద్యా కమిషన్ 30 మంది తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించింది.

గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌కు కోటి సబ్సిడీ

కొత్త గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో హరిత ఇంధనాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందిస్తున్నది. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. సంబంధిత ముసాయిదాపై శుక్రవారం సంబంధిత భాగస్వాములు, వాటాదారులతో సంప్రదింపులు జరిపింది. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క హాజరయ్యారు. సీఐఐ, ఫిక్కీ, ఎన్టీపీసీ, ఎఫ్‌టీసీసీఐ, సోలార్ ఎనర్జీ అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధులతో చర్చించారు. గ్రీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని పెంచేందుకు రాష్ట్రంలో ఫ్లోటింగ్ సోలార్, వేస్ట్ టు ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను నెలకొల్పుతారు. ఈ 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీలో సింగరేణి సంస్థ 5 వేల మెగావాట్లు ఉత్పత్తి చేయనున్నట్టు తెలిసింది. ఇదిలా ఉండగా, గ్రీన్ ఎనర్జీ పాలసీని మంత్రివర్గం ఆమోదించిన తర్వాత తుది పాలసీని ప్రకటిస్తామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు కోసం లీజుకు ఇవ్వాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది.

ముఖ్య ప్రోత్సాహకాలు ఇవే..

- గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లకు పెట్టుబడిలో 25% (గరిష్ఠంగా రూ.కోటి) సబ్సిడీగా సమకూరుస్తారు.
- ప్లాంట్ల ఏర్పాటుకు ప్రైవేట్ వ్యవసాయ స్థలాలను నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా కన్వర్ట్ చేస్తారు.
- మెటీరియల్, పరికరాలపై స్టేట్ జీఎస్టీని రీయింబర్స్ చేస్తారు.
- పావలా వడ్డీతో ఐదేండ్లపాటు రుణాలిస్తారు. పెట్టుబడిలో 15% (గరిష్ఠంగా రూ.20 లక్షలు) సబ్సిడీగా సమకూరుస్తారు.
- వందశాతం స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. 20% సబ్సిడీగా ఇస్తారు. ఒక్కో వ్యక్తికి 2 వేల చొప్పున చెల్లిస్తారు.
- క్వాలిటీ సర్టిఫికేషన్, పెటెంట్ హక్కుల కోసం 50% (గరిష్ఠంగా 2 లక్షలు) రీయింబర్స్ చేస్తారు.
- ట్రాన్స్‌మిషన్ చార్జీల్లో ఐదేండ్లు 50%, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్‌చార్జీల్లో 100% మినహాయింపు.

స్కూల్‌కు డుమ్మా.. ఫ్రీ బస్‌లో చక్కర్లు

- **ఫ్రీ బస్ తెచ్చిన తంటా..**
- **కలకలం రేపిన ముగ్గురు బాలికల అదృశ్యం**
- **24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు**

నవీపేట, జనవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు పథకం ముగ్గురు విద్యార్థినుల అదృశ్యానికి కారణమైంది. బాలికలు స్కూల్‌కు రాకపోవడంతో ఉపాధ్యాయులు ఆరా తీయగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆధార్ కార్డులతో ఇంటినుంచి బయల్దేరిన విద్యార్థినులు బస్సుల్లో చక్కర్లు కొట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు 24 గంటల్లోనే వారిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లాలో కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు శుక్రవారం వెల్లడించారు. నవీపేట మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో సమీప గ్రామాల్లోని ముగ్గురు బాలికలు పదో తరగతి చదువుతున్నారు. రోజూలాగే గురువారం స్కూల్‌కు వెళ్తున్నామని చెప్పి ఇంటి నుంచి బయల్దేరారు. బడికి డుమ్మా కొట్టి ఉచిత బస్సులో పొద్దంతా చక్కర్లు కొట్టాలని ముందుగానే నిర్ణయించుకున్న ఆ ముగ్గురు ఆధార్ కార్డులను వెంట బెట్టుకుని వచ్చారు. స్కూల్ బ్యాగులను ఎక్కడో వదిలేసి ఒక్కచోట కలుసుకున్నారు. నవీపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కి బోధన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి మళ్లీ నవీపేట్ మీదుగా నిజామాబాద్ చేరుకున్నారు. అక్కడి నుంచి కామారెడ్డికి వెళ్లి తిరిగి నిజామాబాద్‌కు వచ్చారు. అటు నుంచి నవీపేట్‌కు వెళ్లి మళ్లీ నిజామాబాద్‌కు వచ్చి జగిత్యాలకు వెళ్లారు. తిరిగి నిజామాబాద్‌కు చేరుకున్నారు. బాలికలు స్కూల్‌కు రాకపోవడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆరా తీశారు. పిల్లలు పొద్దున్నే ఇంటి నుంచి బయల్దేరారని వారు చెప్పగా, స్కూల్‌కు రాలేదని టీచర్లు స్పష్టం చేశారు. దీంతో కంగారు చెందిన తల్లిదండ్రులు రోజంతా వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించక పోవడంతో నవీపేట్ పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసు అధికారులు మూడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి గాలించారు. అదృశ్యమైన బాలికల్లో ఒకరి దగ్గర ఫోన్ ఉండడంతో, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిజామాబాద్ బస్టాండ్‌లో పట్టుకున్నారు. మరో ఇద్దరి ఆచూకీ లభ్యం కాలేదు. నవీపేట ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిజామాబాద్ బస్టాండ్‌లో తిష్ట వేశాయి. శుక్రవారం సాయంత్రం ఇద్దరు బాలికలు బస్సు దిగుతుండగా పట్టుకుని నవీపేట్ ఠాణాకు తీసుకొచ్చారు. ముగ్గురు విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించడంతో ఉత్కంఠకు తెరపడింది. ఉచిత బస్సు ప్రయాణం తమ పిల్లలకు ప్రాణ సంకటంగా మారిందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 3: సినీనటుడు అల్లు అర్జున్‌కు భారీ ఊరట లభించింది. 'పుష్ప-2' చిత్రం బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగి ఓ మహిళ మరణించిన కేసులో ఆయనకు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్‌ను నాంపల్లి కోర్టు మంజూరు చేసింది. 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జి వినోద్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

షరతులతో కూడిన బెన్‌ఫిట్ షో!

అనుమతి కోరిన దిల్‌రాజు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): షరతులతో కూడిన బెనిఫిట్ షోలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని టీజీఎఫ్‌డీసీ నూతన చైర్మన్ దిల్‌రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిసింది. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా ఆధ్వర్యంలో జరిగిన భేటీలో ఆయన కోరినట్టు సమాచారం. దీనిపై ఇప్పటికే సీఎం అసెంబ్లీలో ప్రకటన చేసినందున.. వీటిపై అనుమతి ఇవ్వబోమని, సినీ పరిశ్రమ కోరికను ప్రభుత్వానికి నివేదిస్తానని రవిగుప్తా హామీ ఇచ్చినట్టు తెలిసింది.

కొత్వాల్‌గూడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 54లో బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

52 ఎకరాల పరిధిలో ప్రభుత్వ బోర్డులు

శంషాబాద్ రూరల్, జనవరి 3: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామంలోని 'ఆ 52 ఎకరాల భూమి ప్రభుత్వానిదే..' అంటూ నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కాగా, ఆ భూములపై జిల్లా రెండో అదనపు న్యాయస్థానం తీర్పునిచ్చిందంటూ ఇటీవలే ప్రభుత్వ న్యాయవాది రెవెన్యూ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం సర్వే నంబర్ 54లోని 52 ఎకరాల భూమి సర్కారుదేనని సూచిస్తూ తహసీల్దార్ రవీంద్ర దత్ సిబ్బందితో కలిసి బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ.250 కోట్ల విలువచేసే సర్కారు భూములను కాపాడేందుకు కొన్నాళ్లుగా రెవెన్యూ అధికారులు న్యాయస్థానంలో పోరాటం చేశారని తెలిపారు. ఈ భూముల్లో ప్రస్తుతం కన్వెన్షన్ సెంటర్, కొన్ని నిర్మాణాలను గుర్తించామని, త్వరలోనే అధికారుల ఆదేశాలతో వాటిని తొలగించి ప్రజావసరాల కోసం భూములను కేటాయిస్తామని పేర్కొన్నారు. విలువైన భూములను కాపాడేందుకు ప్రభుత్వ అధికారులు తీసుకున్న చొరవపై ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. భూములను పేదల ఇండ్ల నిర్మాణాల కోసం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పిండం దశలోనే శస్త్రచికిత్స

- **ప్రపంచంలోనే మొదటిసారి నిర్వహించిన రెయిన్‌బో హాస్పిటల్**

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): చిన్నారుల గుండె శస్త్రచికిత్సలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కొత్త చరిత్ర సృష్టించింది. గర్భంలో ఉన్న పిండం గుండె పనితీరును గుర్తించి, చికిత్స చేయడమే క్లిష్టమైన ప్రక్రియ. కాగా కడుపులో ఉన్న శిశువు గుండెకు రంధ్రం చేసి, ఆ రంధ్రం ద్వారా విజయవంతంగా చికిత్స జరిపి కొత్త రికార్డు సృష్టించారు రెయిన్‌బో దవాఖాన వైద్యులు. ఈ పద్ధతి ప్రపంచంలోనే తొలిసారి చేసినట్టు హాస్పిటల్ చీఫ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కోనేటి నాగేశ్వర్‌రావు వెల్లడించారు. హాస్పిటల్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది పిల్లల్లో పుట్టకముందే అయోటిక్ వాల్వ్ మూసుకుపోతుందని చెప్పారు. శిశువుకు గుండెలో పెద్ద రంధ్రం చేసి, దాని ద్వారా బెలూన్‌ను పంపించి అయోటిక్ వాల్వ్‌ను విజయవంతంగా ఓపెన్ చేశామని డాక్టర్ కోనేటి వివరించారు. ఈ ప్రొసీజర్‌కు 'ఫీటల్ బెలూన్ అయోటిక్ వాల్వాటమి అండ్ డివైజ్ క్లోజర్' అని పేరు పెట్టినట్టు తెలిపారు. ఇప్పటివరకు ఈ పద్ధతిలో శస్త్రచికిత్స ఎక్కడా చేయలేదని, భవిష్యత్తులో రకరకాల ప్రొసీజర్స్‌ను ఈ పద్ధతిలో చేయవచ్చని వివరించారు. సమావేశంలో రెయిన్‌బో సీఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల పాల్గొన్నారు.